ప్రజాశక్తి

సోమవారం 6 అక్టోబర్ 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా



నడకుదురు-చల్లపల్లి రోడ్డు దుస్థితి

అడుగుకో గుంత... ప్రయాణించేదెట్లా..?

- అధ్వానంగా ఆర్‌అండ్‌బి రోడ్లు
- కృష్ణాలో రూ.16.24 కోట్లతో మరమ్మతులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

వాహనదారులకు గోతులు లేని రోడ్లను ఏర్పాటు చేస్తామని కూటమి నేతలు ఇచ్చిన హామీలు ఆచరణకు నోచుకోవడం లేదు. అత్యంత ప్రాధాన్యత కలిగిన రహదారులు, భవనాలు శాఖ (ఆర్‌అండ్‌బి) రోడ్లు తీరు తెన్ను లేకుండా పోయాయి. అడుగుకో గుంత పడటంతో మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లపై సైతం ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. ఈ రహదారులపై వెళ్లడానికే వాహనదారులు వెనుకంజ వేస్తున్నారు. ధ్వంసమైన రహదారులకు అత్యవసరంగా కనీస మరమ్మతులు చేయడానికి రూ.16.24 కోట్లు అవసరమని జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం కనీస మరుమ్మతులకు ఆలస్యం చేయకుండా అవసరమైన నిధులు విడుదల చేస్తేనే రహదారులకు మోక్షం ఏర్పడి వాహనదారులకు ఊరట దొరుకుతుంది.

నాలుగు చక్రాల వాహనదారులు పామర్రు-చల్లపల్లి మధ్య 26 కిలోమీటర్లు ప్రయాణించడానికి గంటన్నర పడుతోంది. భారీ గోతులు ఉన్న ఈ రోడ్డుపై వెళ్లిన వాహనాలు దెబ్బతింటున్నాయి. వాటి మరమ్మతులకు వేల



రూపాయలు వ్యయం చేయాల్సి వస్తోంది. జాతీయ రహదారి విజయవాడ-మచిలీపట్నం (ఎన్‌హెచ్-65) మచిలీపట్నం మీదుగా 46 కిలోమీటర్లు ప్రయాణించి ప్రయివేటు వాహనదారులు చల్లపల్లి చేరుకుంటున్నారు. ఆర్‌అండ్‌బి రహదారిపై కన్నా 20 కిలో మీటర్లు అదనంగా ప్రయాణిస్తున్నారు. ఇలా ప్రయాణిస్తున్న ఒక్కో కారుకు ట్రిప్పుకు రూ. 300, లారీ ఇతర భారీ వాహనదారులు రూ. 750 ఆయిల్‌కు, టైర్ల అరుగుదలకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. అవనిగడ్డ- చల్లపల్లి -విజయవాడ వయా నడకుదురు కరకట్ట మీదుగా ప్రయాణించే వాహనాల సంఖ్య పెరిగిపోయింది. ఇసుక లారీలు, కారులు, ఆర్టీసీ బస్సులు ఈ రూట్లో రోజువారీ అధిక సంఖ్యలో వెళుతున్నాయి. ఈ రోడ్డు గోతులమయంగా మారడంతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ఈ రెండు రోడ్లు మాత్రమే కాదు...జిల్లా వ్యాప్తంగా ఆర్ అండ్ బి శాఖకు చెందిన మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 169.1 కిలో మీటర్లు రోడ్డు గోతులు పడ్డాయి. దీనికి రూ. 14.40 కోట్లు వ్యయం అవుతుందని (మిగతా 2లో)

విజయవాడలో భారీ వర్షం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడలో ఉరుములు-మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆదివారం రాత్రి 7 నుంచి 8 గంటల్లోపు కురిసిన వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది. దాదాపుగా అరగంటకు పైగా ఉరుములు, మెరుపుల మోతలతో నగర ప్రజలు భీతిల్లిపోయారు. డ్రైయిన్లు పొంగిపొర్లి రోడ్లమీద పెద్దఎత్తున నీరు నిలబడింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కాళేశ్వరరావు మార్కెట్, పిఎన్ బస్‌స్టేషన్ సమీప రైల్వే అండర్ బ్రిడ్జీల కింద మోకాళ్ల లోతు నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారీ వర్షం బీసెంట్‌రోడ్డు, ఇతర ప్రధాన సెంటర్లలో చిరు వ్యాపారులు, హాకర్స్‌పై తీవ్ర ప్రభావం చూపింది. రాణిగారితోట, కృష్ణలంక, పటమట, సింగ్‌నగర్, భవానీపురం, చిట్టినగర్, హెచ్‌బి కాలనీ, విజయాడైరీ ఏరియా, ఆటోనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైయిన్లు పొంగిపొర్లి, ఇళ్ల ముందే నీరు నిలిచిపోయిన పరిస్థితి నెలకొంది. ఆదివారం సెలవు కావడంతో విఎంసి అధికారులు రోడ్ల పక్కన నిలిచిపోయిన నీటిని తోడించే పరిస్థితి లేకుండా పోయింది.

ఇంద్రకీలాద్రిపై కొనసాగుతున్న రద్దీ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ

ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ సన్నిధిలో ఈ ఏడాది దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. దేవి నవరాత్రుల సందర్భంగా భవానీమాల ధరించిన భవానీలు దీక్ష విరమణ నిమిత్తం ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. దీంతో ఉత్సవాల చివరి రెండు రోజుల నుంచి ఆదివారం వరకు భవానీల తాకిడితో ఇంద్రకీలాద్రిపై రద్దీ కొనసాగుతుంది. ఉత్తరాంధ్ర నుంచి భారీ సంఖ్యలో తరలివస్తున్న భవానీలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. క్యూలైన్లో భవానీలకు నిరంతరాయంగా తాగునీరు, పాలు, మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. దుర్గగుడి ఈవో సీనా నాయక్, ఆలయ చైర్మన్ బొర్రా రాధాకష్ణ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యూలైన్లను పర్యవేక్షించారు. భవానీల రద్దీ దృష్ట్యా ఇంద్రకీలాద్రిపై వాహనాల రాకపోకలను రద్దు చేశారు. ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు సుమారు 80 వేల మందికి పైగా యాత్రికులు అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



స్తంభించిన పాలన... నిండుకున్న ఖజానా..!

- మూడు వారాలుగా ముందుకు సాగని విఎంసి కార్యకలాపాలు
- దసరా నవరాత్రుల ఉత్సవాలు, అతిసార నివారణపైనే దృష్టి



ప్రజాశక్తి-విజయవాడ

ఈ నెల 8వ తేదీన విజయవాడ నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. గత నెల 16న నిర్వహించాల్సిన ఈ సమావేశం న్యూఆర్‌ఆర్‌పేటలో విజృంభించిన అతిసార కారణంగా అర్ధాంతరంగా వాయిదా పడింది. బుధవారం జరగనున్న కౌన్సిల్లో ఎజెండాలో పేర్కొన్న ప్రజాసమస్యలపై సమగ్రంగా సభ్యుల మధ్య ఎంత వరకు చర్చ జరుగుతుందో చూడాలి. అయితే మూడు వారాలకు పైగా విఎంసి కార్యకలాపాలు, పౌర సేవలు పూర్తిగా నిలిచిపోయాయి. దసరా ఉత్సవాలు, న్యూ ఆర్‌ఆర్‌పేటలో అతిసార సమస్యపై అధికారులు, ఉద్యోగులందరూ దృష్టి సారించాల్సి వచ్చింది. ప్రతి సోమవారం జరిగే పిజిఆర్‌ఎస్ కార్యక్రమం కూడా నిలిచిపోయింది. ఫలితంగా ఎక్కడ సమస్యలు అక్కడే అన్నట్లు తయారయ్యాయి. శానిటేషన్ నిర్వహణ దగ్గర నుంచి రెవెన్యూ వసూళ్లు, ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరగాల్సిన అభివృద్ధి పనులు ఆగిపోయాయి.

దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆ పరిసర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహణపై కేంద్రీకరణ చేసిన విఎంసి, నగరంలోని మిగిలిన ప్రాంతాలపై దృష్టి పెట్టలేదు. వీధులు, డ్రైయిన్లు స్వీపింగ్, క్లీనింగ్ లోపించి, గ్యాంగ్ వర్క్ కూడా పూర్తిగా జరగలేదు. కొండ ప్రాంతాలు, మురికివాడలు, లోతట్టు ప్రాంతాలు, కాలువ కట్టల ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో శానిటేషన్ నిర్వహణ అస్తవ్యస్తంగా తయారయింది. దోమలు, ఈగలు పెరిగిపోయాయి. వీధుల్లో కుక్కల బెడద ఎక్కువైంది. రెవెన్యూ రాబడి కూడా పూర్తిగా నిలిచిపోయింది. ముఖ్యంగా ఆస్తి పన్నుల రాబడి మందగించింది. ఎస్టేట్ విభాగం నుంచి కూడా రాబడి తగ్గినట్లు అధికారులు వివరిస్తున్నారు. మరొక వైపున పట్టణ ప్రణాళిక విభాగం నుంచి బిల్డింగ్ అనుమతుల ఫీజులు, ఇతర పలురూపాల్లో రావాల్సిన రెవెన్యూ కూడా తగ్గిపోయింది. మరొక వైపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వివిధ పద్దుల కింద విఎంసి రావాల్సిన వందల కోట్లు రాకుండా పోయింది. సుమారు రూ.650 కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ పద్దుల రూపంలో విఎంసికి జమ చేయాల్సి ఉందని అధికారుల నుంచి సమాచారం వినిపిస్తుంది. దీంతో పాటు ఆయా రూపాల్లో రావాల్సిన రాబడి పూర్తిగా స్తంభించిపోవడం, మరొకవైపున విఎంసికి సంబంధం లేని దసరా ఉత్సవాల నిర్వహణ ఖర్చులు లాంటి కోట్లాది రూపాయలు విఎంసి జనరల్ ఫండ్ నుంచి ఖర్చు చేయడం, అలాగే న్యూఆర్‌ఆర్‌పేటలో విజృంభించిన డయేరియా నివారణకు ఖర్చు చేసిన కోట్ల రూపాయల్లో ఒక్క పైసా కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం, ఇలా అనేక రూపాల్లో విఎంసిపై భారంపడింది. దీంతో నగరంలో చేయాల్సిన వందల కోట్ల వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. బిల్లులు చెల్లించడం లేదని సదరు విఎంసి కాంట్రాక్టర్లు కూడా పనులు చేయడానికి ముందుకు రాని వైనం నెలకొంది. ఇటువంటి పరిస్థితుల్లో చేసేది లేక ఆయా బ్యాంక్‌ల నుంచి కాంట్రాక్టర్లకు లోను ద్వారా రుణ సదుపాయం కల్పించి, షఉరిటీగా విఎంసి హామీ ఇస్తుంది. ఇటువంటి ఆర్థిక పరమైన క్లిష్టపరిస్థితి గతంలో ఎన్నడూ ఎదురు కాలేదని విఎంసి అధికారులు వివరిస్తున్నారు. దాదాపుగా రూ. 50 కోట్లకు పైగా కాంట్రాక్టర్లకు విఎంసి బకాయి ఉన్నట్లు తెలిసింది.చిన్న చిన్న కొందరు కాంట్రాక్టర్లుతమకు ఇవ్వాల్సిన ఐదు, పది లక్షల లోపు బిల్లులు ఇవ్వకుంటే ఆందోళనకైనా వెనుకాడేది లేదని బహాటంగానే వ్యక్తం చేస్తున్నారు. మరొక వైపున ఎవరికయితే రాజకీయ, ఆర్థిక పరమైన అండ ఉంటుందో అటువంటి కాంట్రాక్టర్లకే బిల్లులు (మిగతా 2లో)

రైతుకు 'అన్నదాత సుఖీభవ' కష్టాలు..!

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)
రైతులను 'అన్నదాత సుఖీభవ' కష్టాలు నేటికి వెంటాడుతూనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ పథకం కింద ఏడాది రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల వాగ్దానాల్లో ప్రకటించారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పథకం అమలుకు వచ్చే సరికి లేని పోనీ సాకులతో రైతుల సంఖ్య కుదించింది. ప్రభుత్వంపై వ్యతిరేకత రాకుండా ఉండటానికి నిధులు పడని వారు మరలా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించింది. అర్హత ఉండి నిధులు జమ కానీ రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవడానికి వెళితే గ్రీవెన్స్ మాడ్యూల్ క్లోజ్ అయ్యిందని అధికారులు చెబుతున్నారు.

కృష్ణా జిల్లాలో రైతులకు అన్నతదాత సుఖీభవ కష్టాలు నేటికి తొలగడం లేదు. ఆగస్టు రెండవ తేది నుంచి రైతుల ఖాతాల్లో మొదటి విడత అన్నదాత సుఖీభవ డబ్బులు వేశారు. జిల్లాలో మొత్తం రైతులు 2.30 లక్షల మంది ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయితే ప్రభుత్వం 1,36,594 మందిని అర్హులుగా తేల్చింది. వీరిలో 1,32,902 మంది రైతులు ఈకేవైసి పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వివిధ కారణాలతో మరో 3,229 మంది రైతుల దరఖాస్తులను తిరస్కరించారు. మరో 459 దరఖాస్తులు ఈకేవైసి పెండింగ్‌లో ఉన్నాయి. అదే విధంగా పథకానికి అర్హత ఉన్నప్పటికీ ఇప్పటి వరకు డబ్బులు పడని వారి సంఖ్య గణనీయంగా ఉంది. పడని వారు తిరిగి దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి డబ్బులు వేస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే నిధులు జమ కానీ రైతులు దరఖాస్తు చేసుకోవడానికి వెళితే అందుకు సంబంధించిన గ్రీవెన్స్ మాడ్యూల్ క్లోజ్ అయ్యిందని అధికారులు చెప్పంతో ఎవరి దగ్గరి కెళ్లి సంప్రదించాలో కూడా తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం గ్రీవెన్స్ మాడ్యూల్ను ఓపెన్ చేస్తే అందులో లబ్దిదారుల విజ్ఞాపనలను సరిచేయడానికి వీలుంటుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రీవెన్స్ మాడ్యూల్ ఓపెన్ చేసి అర్హత కలిగిన రైతులకు అన్నదాత సుఖీభవ పథకం వర్తింప చేసేలా చూడాలని జిల్లాలోని అన్నదాతలు కోరుతున్నారు.

అర్హులందరికీ వర్తింపజేయాలి
ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు

అన్నదాత సుఖీభవను రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడత ఆగస్టు రెండవ తేదీన ఆరంభించింది. ఇప్పటికే చాలా మంది రైతులకు డబ్బులు వారి ఖాతాల్లో జమ కాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపి సమస్యలున్న వాటిని పరిష్కరించేందుకు ప్రత్యేకంగా గ్రీవెన్స్‌ను ఏర్పాటు చేయాలి. లబ్దిదారుల నుంచి ఆర్జీలు తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.



కట్టలేరుపై రోడ్డును పునరుద్ధరించరూ..!

ప్రజాశక్తి-గంపలగూడెం: కట్టలేరు రోడ్డుపై ప్రయాణం చేసి దాదాపు 20 రోజులైంది. వర్షాల నేపథ్యంలో రోడ్డుపై ప్రయాణం సాధ్యం కానందున తంటాలు పడి 20 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి వస్తోంది. వర్షం పడిన ప్రతీసారి రెండు మూడు రోజుల్లో తాత్కాలిక రోడ్డును పునరుద్ధరించిన పరిస్థితులు పోయి, నేడు వారాలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. అదనపు ప్రయాణం చేయలేక, కట్టలేరు రాళ్లపై నడవలేక ప్రయాణికులు సతమతమవుతున్నారు. వంతెన నిర్మాణ పరిస్థితులు ఎలా ఉన్నా తాత్కాలిక రోడ్డును అయినా పునరుద్ధరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

మొదటిపేజీ తరువాయి

అడుగుకో గుంత... ప్రయాణించేదెట్లా..?

అంచనా వేశారు. గుడివాడ -చల్లపల్లి-కొత్తపాలెం రోడ్డు 21 నుంచి 23 కిలో మీటర్లు, 35 నుంచి 38 కిలో మీటరు, 52 నుంచి 58 కిలో మీటరు వరకు, రామానగరం నడకుదురు రోడ్డు 0 నుంచి 2 కిలో మీటరు వరకు, నడుపూరు, వడవల్లి -కోరుకొల్లు 1 నుంచి 5 కిలో మీటర్లు, వడ్డమన్నాడ-పెదలంక 9.2 కిలో మీటరు నుంచి 10.6 కిలోమీటరు వరకు కౌతవరం నిడుమోలు రోడ్డులో 20 నుంచి 21 కిలోమీటరు వరకు గుడివాడ- చల్లపల్లి, కొత్తపాలెం రోడ్డు వరకు అత్యవసరంగా మరమ్మతులు చేయడానికి రూ.1.84 కోట్లతో ప్రతిపాదించారు.

సమస్యకు ఏదీ పరిష్కారం?

త్వరలో పోర్టు నిర్మాణం పూర్తవుతుంది. భారీ పరిశ్రమలు వస్తాయి. ఉత్పత్తుల రవాణాకు జాతీయ రహదారుల విస్తరిస్తున్నామని కూటమి నేతలు చెబుతున్నారు. అయితే స్థానిక ఉత్పత్తుల రవాణాకు అవసరమైన రాష్ట్ర రహదారుల గురించి మాత్రం పట్టించుకోవడం లేదు. పూర్తి స్థాయిలో అధ్వాన్నంగా మారి పూర్తిగా నిర్మించాల్సిన రోడ్లకు గోతులు పూడ్చి సరిపెడుతున్నారు. దీంతో చిన్న పాటి వర్షాలకు రోడ్లపై తిరిగి గోతులు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలో పూర్తి స్థాయి నిర్మాణాలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది.

స్తంభించిన పాలన... నిండుకున్న ఖజానా..!

వస్తున్నాయని పలువురు కాంట్రాక్టర్లు వ్యక్తం చేస్తున్నారు. ఆప్కాస్ కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు, వాహనాల డీజిల్ బిల్లులు, ఇతర నెల వారీ ఖర్చులకు సుమారు రూ. 25 కోట్లు అవసరం కాగా వాటి కోసమే ప్రతి నెలా ఎదురు చేసే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తుంది. ఇటువంటి ఒక సంక్లిష్ట పరిస్థితిని విజయవాడ నగరపాలక సంస్థ ఎదుర్కొంటుంది. ఫలితంగా నగరంలోని ఆయా తరగతుల ప్రజలకు పౌర సేవలు అందుబాటులో లేకుండా పోతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరొక వైపున వివిధ రూపాల్లో ప్రజలపై భారాలు మోయక తప్పడం లేదు. కౌన్సిల్‌లోని అధికార వైసిపి, ప్రధాన ప్రతిపక్షం టిడిపి, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఎంసిని గాలికొదిలేశాయి. విజయవాడ ఉత్సవాలు, దసరా నవరాత్రుల ఉత్సవాలను కోట్లాది రూపాయలు ఖర్చు చేసి భారీ ఎత్తున నిర్వహించిన విజయవాడ ప్రజాప్రతినిధులు, దుగుంటుతున్న వీఎంసి ఖజానా, స్తంభించిన పాలనా తీరుపై దృష్టి సారించే సమయం కానీ, చిత్తశుద్ధి కానీ లేదని నగర ప్రజల నుంచి తీవ్రమైన విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఆర్ట్ కాంటెస్ట్

విజయవాడ: చిన్నారుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసి వారికి ప్రకృతి పట్ల అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో 'స్మార్ట్ క్రియేటివ్ ఆర్ట్ స్కూల్' ఆధ్వర్యంలో 3 నుంచి 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు ప్రకృతిలో నేను... అనే అంశంపై ఆదివారం ప్రజాశక్తి నగర్‌లోని శిఖర స్కూల్ క్యాంపస్‌లో ఆర్ట్ కాంటెస్ట్ నిర్వహించారు. ఈ కాంటెస్ట్‌లో సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రకృతి పట్ల తమకు ఉన్న ప్రేమని చిత్రాల ద్వారా చాటారు. ఈ కాంటెస్ట్‌కి ప్రముఖ సీనియర్ ఆర్టిస్ట్ పావులూరి చించబరేశ్వరరావు, ఆస్ట్రాజన్ మల్టీమీడియా పబ్లికేషన్స్ ఆర్ట్, క్రాఫ్ట్ ఇన్చార్జి మేడా రజని న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి శిఖర స్కూల్ డైరెక్టర్ బండ్ల మాధవరావు, 64కళలు.కామ్ ఎడిటర్ కళాసాగర్, ఎలిమెంట్ స్కూల్ ఆఫ్ డిజైన్ ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ పసుమర్తి అమర దీప్తి, సోమూరి కంస్ట్రక్షన్స్ డైరెక్టర్ రేష్మా సోమూరి విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపకాలు, పతకాలు అందజేసారు. ఈ కార్యక్రమాన్ని స్మార్ట్ శ్రీనివాస్ పర్యవేక్షించగా యువ చిత్రకారులు గోపీ మనోజ్, హేమంత్ కుమార్,శ్రీ శివ లాస్య, పద్మజ, సింధూ శ్రీ తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాళహస్తి పాలకవర్గ సభ్యులుగా శంకరశెట్టి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్: శ్రీకాళహస్తి శ్రీశైలం దేవస్థానం పాలకవర్గం సభ్యులుగా నియమితులైన ఇప్పటం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు శంకరశెట్టి పిచ్చయ్యను ఆదివారం పలువురు టిడిపి నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. వడ్డేశ్వరం టిడిపి సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు పిచ్చయ్యకు శాలువా కప్పి, ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పిచ్చయ్య మాట్లాడుతూ తనను దేవస్థానం మెంబర్‌గా నియమించిన ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలియజేశారు. అభినందనలు తెలిపిన వారిలో వడ్డేశ్వరం గ్రామ టిడిపి అధ్యక్షులు ఈపూరి బాబు, ఇప్పటం గ్రామ టిడిపి అధ్యక్షులు జెముడు గాని రత్తయ్య, నాయకులు చావలి సురేష్, వెలగపూడి కిషోర్ బాబు, షేక్ నాగూర్‌వలి, షేక్ ఇమాంసా, మస్తాన్‌వలి, వి.ప్రసాద్, అప్పారావు తదితరులు ఉన్నారు.



సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - మంగళగిరి: స్థానిక కొత్తపేట 1, 2 వార్డులలో ఆటో సోదరులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యా ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు ఆదివారం పాలాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి మిఠాయిలు పంచారు. ఈ కార్యక్రమంలో 2వ వార్డు మాజీ కౌన్సిలర్ రంగిశెట్టి నరేంద్ర (బాబి),శివాలయం ట్రస్ట్ బోర్డ్ మెంబర్ సుఖమంచి గిరిబాబు, టౌన్ కమిటీ మెంబర్ తాడిగిరి సుధీర్, 2వ వార్డు అధ్యక్షులు కట్టా దుర్గాప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఫణిదపు మల్లేశ్వరరావు, 1వ వార్డు అధ్యక్షుడు సైనాదం శ్రీనివాసరావు, పూజల శ్రీనివాసరావు పెద్దబ్బాయి, మంగళగిరి శ్రీనివాసరావు, బండారు రమేష్, కె.దుర్గారావు, సజ్జా సాయికుమార్, రాగవరపు గోపి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



చిరు వ్యాపారాలను ప్రభుత్వం ఆదుకోవాలి

విజయవాడ: విజయవాడ తూర్పు నగర హాకర్స్, వెండర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం రాణి గారితోట గుంటూరు బాపనయ్య భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కన్వీనర్ టి.చంద్రశేఖర్, కో కన్వీనర్ బి.శ్రీనివాసులు, 13 మందితో నగర కమిటీ ఏర్పాటైంది. అనంతరం సిఐటియు తూర్పు నగర అధ్యక్ష, కార్యదర్శులు వి.బి.రాజు, యన్.కోటిబాబు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం 11 సంవత్సరాల పాలనలో నోట్ల రద్దు, జిఎస్టి, కార్మిక చట్టాల్లో మార్పులు, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ వంటి ప్రజలకు నష్టం చేసే అనేక విధానాలను అమలు చేసి దేశాన్ని ఆర్థికంగా దెబ్బ తీసిందన్నారు. రెండు సంవత్సరాల కరోనా కాలంలో ప్రభుత్వాల అసమర్థత వల్ల ప్రజల కొనుగోలు శక్తి పడిపోయి వ్యాపారాలన్నీ 30 శాతం తగ్గిపోయాయన్నారు. దీనితో చిరు వ్యాపారాలు చేసుకుంటున్న హాకర్ల పరిస్థితి మరింత దిగజారి కుటుంబాలను నడుపుకోవడం కూడా కష్టంగా మారి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విజయవాడ తూర్పు నియోజకవర్గంలో చిరువ్యాపారాల ద్వారా స్వయం ఉపాధి పొందుతున్న హాకర్స్, వెండర్స్ వేలాది మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం ఉపాధి చూపించక పోయినా ఎవరి మీద ఆధారపడకుండా



స్వయం ఉపాధితో తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని చెప్పారు. అలాంటి వారి ఉపాధిని దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని, మున్సిపల్, పోలీసుల వేధింపులు పెరిగాయని అన్నారు. పెద్ద పారిశ్రామిక వేత్తలకు లక్షల కోట్ల రూపాయల బ్యాంకు రుణాలు మాఫీ చేసిన ప్రభుత్వాలు ప్రజలకు అనేక రకాలుగా సేవలు అందిస్తున్న హాకర్లకు కనీసం బ్యాంకు లోన్లు కూడా ఇవ్వటంలేదన్నారు. అందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, జీవిత బీమా ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని, టిఫిన్ బండ్లు నడుపుకునే వారికి కమర్షియల్ గ్యాస్ సిలిండర్ పద్ధతి రద్దుచేసి సాధారణ సిలిండర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు పి.కృష్ణ, టి.చంద్రశేఖర్, యన్.నాగేశ్వరరావు, ఈశ్వర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.



బాధితుడికి సాయం అందిస్తున్న దృశ్యం

బాధితుడికి సాయం

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆటో ప్రమాద బాధితులకు అండగా నిలుస్తామని నియోజకవర్గ యువ నేత మండలి వెంకట్రామ్ అన్నారు. చల్లపల్లి నారాయణరావు నగర్ ఎస్సీ కాలనీకి చెందిన కుంభ రవితేజ ఆటో ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితం కావడంతో వైద్య ఖర్చులకు దాతలు అందించిన ఆర్థిక సాయం ఇరవై వేల రూపాయలను వెంకట్రామ్ బాధితులకు ఆదివారం అందజేశారు. గ్రామ పంచాయతీ ద్వారా సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి పదివేల రూపాయలు, రావెల కృష్ణ సేవా సమితి చైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ ఎనిమిది వేల రూపాయలు, మరో దాత 2000 రూపాయలు సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ,సొసైటీ చైర్ పర్సన్ బొందలపాటి వీరబాబు,పంచాయతీ కార్యదర్శి పి. వి మాధవేంద్రరావు, నేతలు మోర్ల శివ, కో ఆప్షన్ సభ్యులు షేక్ నభి ఘోరి, జనసేన నేతలు పాల్గొన్నారు.



రావెళ్ల కృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం మంగళాపు రంలో శిథిలమైన రోడ్డును అభివృద్ధిప రిచేందుకు రావెల కృష్ణ సేవా సమితి అధ్యక్షులు రావెళ్ల ఉదయకుమార్ ఆదివారం ఉదయం పనులు చేపట్టారు. రూ. 1.20 లక్షలు ఖర్చు చేసి గోతుల్లో వెట్ మిక్స్ వేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేశారు. రహదారులు గోతుల మయంగా మారి వర్షం వస్తే ప్రజలకు ఇబ్బందిగా మారింది. స్పందించిన ఉదయకుమార్ స్వచ్ఛంగా అందంగా ముందుకు వచ్చి రహదారులను బాగు చేయడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దళితుల వాడనుండి చెరువు వరకు ప్రధాన రహదారిపై పడిన గోతులలో వెట్ మిక్స్ వేశారు. డీసీ చైర్మన్ నిడమానూరు దిలీప్ కుమార్, టిడిపి నేత రావెళ్ల విజయ్, పరుచూరి కమలాకర్ రావు తదితరులు పనులను పర్యవేక్షించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామానికి తనవంతుగా అభివృద్ధికి సహకారం అందించాలని ఉద్దేశంతో మరమ్మత్తులు చేయించినట్లు రావెళ్ల ఉదయ్ కుమార్ తెలిపారు.

538 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో గుడ్లవల్లేరు వైద్య శిబిరంలో ఆదివారం ఉచిత కార్పోరేట్ వైద్య పరీక్షలు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 538మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావు, గుండె, ఊపిరి తిత్తులు తదితర సంబంధ వ్యాధులకు విజయవాడ కామినేని హాస్పటల్ వైద్యులు ఎస్.దాశరథి, లింగంశెట్టి వర్ధన్, కంటి పరీక్షలకు ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రికి చెందిన హెచ్.భవాని, మానసిక రుగ్మతలకు హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్ తమ వైద్య సేవలను రోగులకు అందించారు. అనంతరం ఉచిత మందులను పంపిణీ చేశారు.

పాతికేళ్ల ఉచిత వైద్యం అందించిన వైద్యులకు సన్మానం

ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో పాతికేళ్ల పాటు ఉచిత వైద్యం అందించిన వైద్య నిపుణులకు ఆదివారం గుడ్లవల్లేరులో ఘన సన్మానం చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆరోగ్య సమస్యలున్న రోగులకు డాక్టర్ వెంకట్రావుతో పాటు మానసిక రుగ్మతలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న హైదరాబాదుకు చెందిన డాక్టర్ హరిహర్‌ను దుశ్శాలువాలతో సన్మానించి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, చాపరాల రాజా, బొల్లవరపు పాపయ్య తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానిస్తున్న దృశ్యం

మెరుగైన జీవన శైలితో వ్యాధులు దూరం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నిత్యం తీవ్ర ఒత్తిళ్లకు గురవుతున్న దయనందిన జీవనంలో మెరుగైన జీవనశైలి మార్పులు ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చుని 33వ డివిజన్ ఇంచార్జ్ అసదుల్లా హుస్సేన్ ఇలియాస్ ఆమీర్ అన్నారు. ఆదివారం జైహింద్ స్కూల్లో మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ శివ కోటేశ్వరరావు, జనరల్ మెడిసిన్ నిపుణులు డాక్టర్ రాజీవ్ ప్రసాద్ శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించారు. శిబిర ప్రారంభ కార్యక్రమంలో మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, డైరెక్టర్ చోడవరపు ప్రసూన, 45వ డివిజన్ ఇంచార్జి పి వీ ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆరోగ్య శిబిరంలో వందమంది వరకు పాల్గొని సేవలు పొందారు.



నేడు కలెక్టరేట్‌లో 'మీకోసం'

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10:30 గంటల నుండి ప్రజా సమస్యల పరిష్కార వేదిక -మీకోసం (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు పాలనను మరింత చేరువ చేయడానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థను మండల, మున్సిపల్ స్థాయిలకు ప్రభుత్వం వికేంద్రీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగం గానే జిల్లా కేంద్రంతో పాటు అన్ని డివిజన్, మండల కేంద్రాల్లో, మునిసిపల్ కార్యాలయాల్లో కూడా ప్రజా సమస్యల పరిష్కార వేదిక- మీకోసం జరుగుతుందని, అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీపంలోని మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో అందజే యవచ్చున్నారు.

వృద్ధులకు సత్కారం



వృద్ధులను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలం ఈడుపు గల్లు గ్రామంలోని దేవాలయాల్లో దేవుని సేవ చేసే వృద్ధులను లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ రూరల్ సెక్రెటరీ లయన్ ఇంజనీర్ రావి సురేష్ బాబు ఆధ్వర్యంలో సత్కరించి దుస్తులు, దుప్పట్లు, పండ్లు చేశారు. ఈ సందర్భంగా రావి సురేష్ బాబు మాట్లాడుతూ 26 సంవత్సరాల ప్రజాసేవ నాకు ఎంతో సంతప్తినిచ్చింది అన్నారు. వందకు పైగా గ్రామాలలో 130కు పైగా ఉచిత మెడికల్ క్యాంపులు, నిర్వహించి అవసరమయిన వారికి ఉచితంగా మందులు,కళ్ళ ఆపరేషన్లు చేపించి కళ్లజోళ్లు అందించినట్లు తెలిపారు. మూడు వేలు పైగా మొక్కలు నాటడం, పంపిణీ చేయడం, పేద విద్యార్థులకు వికలాంగులకు ఆర్థిక సహాయం చేయడం, విద్యార్థులకు ఐదు వేలు పైగా పుస్తకాలు పంపిణీ చేసి వెయికి పైగా కెరీర్ మీద కౌన్సెలింగ్ ఇచ్చినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో కంకిపాడు మండల మాజీ ఎంపీపీ దేవినేని రాజా, గ్రామ సర్పంచ్ పందిపాటి ఇందిర, టీడీపీ అధ్యక్షులు షేక్. షకర్,నర్రా. విజయకుమార్, నందమూరి. మాధవ, వి. నాగేశ్వరరావు, కొల్లిపర. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

స్వచ్ఛ సిహెచ్‌సిగా చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రి ఎంపిక

ప్రజాశక్తి-చల్లపల్లి : స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో చల్లపల్లి ప్రభుత్వాసుపత్రి జిల్లా అవార్డును సాధించింది. ఈ నెల ఆరవ తేదీన మచిలీపట్నంలో జిల్లా కలెక్టర్ నుండి అవార్డు అందుకోనున్నట్లు సూపరెంటెంట్ డాక్టర్ బి.ఎస్.ఆర్. శ్రీనివాస్ ఆదివారం తెలిపారు ఆసుపత్రిలో టాయిలెట్ల నిర్వహణ,పరిశుభ్రత, చేతులు వాష్ చేసుకునేందుకు సౌకర్యాలు, నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు, స్పష్టమైన సూచనలు, సందేశాలతో కూడిన బోర్డులుఏర్పాటు తదితర అంశాలను తీసుకొని స్వచ్ఛ సిహెచ్ సిగా ఎంపిక చేశారు. జిల్లాలో మూడు ఆసుపత్రులను ఎంపిక చేయగా అందులో చల్లపల్లి సిహెచ్‌సి ఒకటి కావడం పట్ల వైద్యులు,అభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

స్వచ్ఛ అంగన్‌వాడీగా చల్లపల్లి మోడల్ అంగన్‌వాడీ

స్వచ్ఛ ఆంధ్ర అవార్డుల్లో చల్లపల్లి నారాయణ మోడల్ మోడల్ అంగన్ వాడి కేంద్రం (1)స్వచ్ఛ అంగన్ వాడిగా జిల్లా స్థాయి అవార్డును సాధించింది. అంగన్ వాడి కార్యకర్త షేక్ ముంతాజ్ బేగం అంగన్ వాడి కార్యకర్తగా పనిచేస్తూ కేంద్రం ఆవరణలో కిచెన్ గార్డెనింగ్,పరిశుభ్రత, పిల్లలకు ఆటవస్తులు తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. జిల్లా మూడు అంగన్వాడి లను అవార్డుకులకు ఎంపిక చేయగా వాటిలో చల్లపల్లి మోడల్ అంగన్వాడి కేంద్రం ఒకటి. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కలెక్టర్ నుండి అవార్డు అందుకొనున్నారు.



చల్లపల్లి ప్రభుత్వ ఆసుపత్రి



అంగన్‌వాడీ కేంద్రం

లారీ ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన సూర్యారావు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బిల్లపాడు రైల్వే గేట్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ ఢీ కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ పట్టణం ద్రోణాదుల వీధిలో నివాసం ఉండే లంకపల్లి సూర్యారావు(63) చిన్న ఎరుకపాడు వద్ద ప్లాస్టిక్ సామాన్లు అమ్మే షాప్‌కు వెళ్ళి మధ్యాహ్నం సమయంలో షాప్ వద్ద నుండి ఇంటికి స్కూటీ మీద వెళుతుండగా బిల్లపాడు రైల్వే గేట్ సమీపంలోకి రాగానే వెనుక వైపు నుండి లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి స్కూటీని ఢీకొడంతో సూర్యారావు అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుని భార్య లంకపల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై గుడివాడ తాలూకా ఎస్ఐ నంబూరి చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రూరల్ మండల పరిధిలోని టిడ్కో కాలనీ శివారు పంట బోదెలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని తాలూకా పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం ఆదివారం ఉదయం 11:30 గంటల సమయంలో మల్లాయపాలెం పంచాయతీ సెక్రటరీ భట్రాజు కోటయ్య ఫిర్యాదు మేరకు సుమారు 40 నుండి 45 సంవత్సరాల మధ్య వయస్సు గల గుర్తు తెలియని మగ వ్యక్తి, నలుపు రంగు ప్యాంటు లేత ఆకుపచ్చ రంగు ఫుల్ హాండ్స్ షర్టు, జేబులో తెలుపు రంగు చార్జర్ కలిగి ఉండి మృతదేహం కుళ్ళిన దశలో గుర్తుపట్టలేనట్లుగా ఉండటాన్ని గుర్తించారు. ఈమేరకు పంచాయితీ కార్యదర్శి ఫిర్యాదు ఆధారంగా గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం పూర్తిగా కుళ్ళిన దశలో ఉండటంతో ఆసుపత్రికి తరలించడం సాధ్యంకాలేదని పంచనామా అనంతరం సదరు ప్రదేశంలోనే డాక్టర్ చే పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు అనుమానస్పద మతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంటిబాబు తెలిపారు.

నిందితుడిని అరెస్టు చేయాలని ఐద్వా వినతి

ప్రజాశక్తి-పామర్రు : మండల పరిధిలోని కొమరవోలులో లైంగిక వేధింపుల కారణంగా శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడిన మేడపాటి వసంత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) కృష్ణా జిల్లా కమిటీ సభ్యులు ఆదివారం పామర్రు యస్ఐ వి.రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం సమర్పించారు. అదే గ్రామానికి చెందిన మెరుగు మాల పవన్ వివాహిత అయిన మేడపాటి వసంతను మానసికంగా, లైంగికంగా వేధించడం వల్లే ఆమె చనిపోయిందని అన్నారు. ఆమె మృతికి కారణమైన మెరుగుమాల పవన్ ను అరెస్టు చేసి మతురాలి కుటుంబానికి న్యాయం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యులు బి.కీర్తి,పి.రజిని,బి.ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా సభ్యులు



మహాత్మా గాంధీపై క్విజ్ పోటీలు

విజయవాడ : విజయవాడలోని ఠాగూర్ గ్రంథాలయంలో 'చదవటం నాకు ఇష్టం' కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీపై క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు దేశ నాయకుడు చరిత్రలో కలిసి ఉండాలన్న ఉద్దేశంతో ప్రతి నెలలో చివరి ఆదివారం క్విజ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్విజ్ పోటీలను మాస్టర్ దేవ్, దుర్గ భవానీలు నిర్వహించారన్నారు. వివిధ పాఠశాలల నుంచి 30 మంది 4 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. క్విజ్ పోటీల్లో విన్నర్లుగా రేణుక, శ్రావ్య, శైలు, దివ్య నిలవగా.. రన్నర్లుగా వెంజిమెన్, బాలాజీ, హారిక, షణ్ముఖ రన్నర్‌లుగా నిలచారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఉమా అనే చిన్నారి మహాత్మా గాంధీ వేషధారణలో వచ్చి విద్యార్థులందరినీ అబ్బురపరిచింది. గ్రంథాలయాధికారి ఆ చిన్నారని మెడల్‌తో సత్కరించారు.



అత్యాధునిక వైద్య సేవలతో .. శ్రీ రామ్ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ

మహిళల కోసం అన్ని రకాల వైద్య సేవలు ఒకే చోట అందించేందుకుగాను అత్యాధునిక వైద్య సేవలతో శ్రీ రామ్ హాస్పిటల్‌ను ప్రారంభించినట్లు ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ కవిత చలసాని అన్నారు. నగరంలోని కస్తూరిభాయి పేటలోని నూతన హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. మహిళలకు సంబంధించిన అన్ని వైద్య సేవలు, అందిస్తామని, ముఖ్యంగా హైరిస్క్ ప్రెగ్నెన్సీ కేర్ ద్వారా ఎటువంటి ఇబ్బందులు లేకుండా వైద్య సేవలు అందిస్తామన్నారు. లాప్రోస్కోపీ సర్జరీ, క్యాన్సర్ స్క్రీనింగ్, పిల్లలు లేని వారికి అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక చికిత్స అందించనున్నట్లు తెలిపారు. చిన్నపిల్లల విభాగం కూడా ఉందని తెలిపారు. 24 గంటలు పూర్తి అందుబాటులో వైద్యులు ఉంటారని అన్నారు. అత్యవసర కేసులకు సంబంధించి 24 గంటలు సేవలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు వైద్యులు హాస్పిటల్ ప్రారంభం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.

పవన్ కల్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని పాదయాత్ర

ప్రజాశక్తి- నందిగామ : పవన్ కల్యాణ్ ఆరోగ్యం మెరుగుపడాలని కోరుతూ జనసేన నాయకులు ఆదివారం సత్తెమ్మ తల్లి ఆలయం నుంచి విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. జనసేన పార్టీ నందిగామ ఇన్‌చార్జ్ రమాదేవి జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. నందిగామ మండలం అంబారుపేట గ్రామానికి చెందిన జనసేన నాయకులు యర్రబడి సురేష్ పాదయాత్ర చేశారు. ఈకార్యక్రమంలో వీరులపాడు జనసేన పార్టీ మండల అధ్యక్షులు బేతపూడి జయరాజు, జుజ్జురు సొసైటీ చైర్మన్ షేక్ రహీంతుల్లా, సీనియర్ నాయకులు బొమ్మిశెట్టి భాస్కరావు, గుడివాడ సాంబశివరావు ,కొట్టె బద్రి, పరిటాల గ్రామ జనసేన అధ్యక్షులు కొమ్మ నరేష్ , దేవిరెడ్డి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై మాట్లాడే అర్హత వైసిపికి లేదు : ఎంపి

ప్రజాశక్తి - తిరువూరు



ప్రజా సమస్యల గురించి మాట్లాడే అర్హత వైసిపి నేతలకు లేదని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. తిరువూరులో నూతనంగా ఏర్పాటు చేసిన టిడిపి పట్టణ, మండల కార్యాలయాన్ని ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ విజయవాడ ఉత్సవ్ నిర్వహణలో తాను అక్రమాలకు పాల్పడినట్లు వైసిపి జిల్లా అధ్యక్షులు దేవినేని అవినాష్, మాజీ మంత్రి పేర్ని నాని చెప్పటం దొంగే దొంగన్నట్లుగా ఉందని తెలిపారు. ఐదేళ్ల వైసిపి పాలనలో అవినీతి అక్రమాలకు పాల్పడిన నాయకులు విజయవాడ ఉత్సవ్‌ను నిలిపివేయడానికి కోర్టులో తప్పుడు పిటిషన్లు వేయించారని ఆరోపించారు. దేవాలయ భూములను లీజుకు తీసుకుని, పారదర్శకంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నప్పటికీ, వైసిపి నాయకులు నిందలు వేశారని మండిపడ్డారు. దేవినేని అవినాష్ విజయవాడ అంతటా భూకబ్జాలకు పాల్పడుతున్నారని, పేర్ని నాని బియ్యం అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. తిరువూరులో కొంత మంది పార్టీని భ్రష్టు పట్టించడానికి ప్రయత్నం చేస్తున్నారని, వారి ఆటలను సాగనివ్వనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి తిరువూరు నియోజకవర్గ పరిశీలకుడు సుఖవాసి శ్రీనివాసరావు, మండల, పట్టణ అధ్యక్షులు దుబ్బాక వెంకటేశ్వర్లు, మల్లెల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు తాళ్లూరి రామారావు, గద్దె వెంకటేశ్వరరావు, దొడ్డా లక్ష్మణరావు, బొద్దు కోళ్ల ప్రేమరాజు, చెరుకూరి రాజేశ్వరరావు, సుంకర కష్ణమోహనరావు, మాదాల కిట్టు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గైర్హాజరు

ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, ఆయన అనుచరులు పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి హాజరు కాకపోవటంతో పార్టీలో వర్గ భేదాలు బయటపడ్డాయి. తిరువూరులో టిడిపి నేతలు ఎమ్మెల్యే, ఎంపి వర్గాలుగా విడిపోయారు. దీంతో తిరువూరులో మండల, పట్టణ కార్యాలయం ఏర్పాటు విషయంలో ఎమ్మెల్యేను కూడా సంప్రదించకుండా ఆయన్ను అవమానపరిచారని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు.

ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం లేదు

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు : పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం లేదని రాష్ట్ర హైకోర్ట్ న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు అన్నారు. వి.ఎస్.ఆర్. ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బ్రాడీపేటలోని జాషువా విజ్ఞాన కేంద్రంలో ఉత్తమ గురుకుల ఉపాధ్యాయులకు అవార్డులు ప్రధానం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేడు అనేక రంగాలతో పాటు విద్యా రంగంలోనూ ఏఐ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వస్తుందన్నారు. అయితే విద్యలో ముఖ్యంగా ఎలిమెంటరీ, హైస్కూల్ విద్యలో ఉపాధ్యాయులకు ఎ.ఐ వంటివి ప్రత్యామ్నాయం కాలేవని చెప్పారు. బోధన వృత్తి కాదని, జీవితాంతం కొనసాగే ప్రక్రియ అన్నారు. మిగిలిన వఅత్తుల మాదిరిగా రిటైర్మెంట్‌తో ఉపాధ్యాయ వఅత్తి ముగిసిపోదని చెప్పారు. విద్యార్థులను కంటితో కాకుండా మనసుతో చూడాలని, ఆ పని ఎఐ చేయలేదని అన్నారు. గురుకుల విద్యాలయాల్లో విద్యను అభ్యసించి, ఎంతోమంది ఉన్నతాధి కారులుగా ఎదిగారని, అటువంటి విద్యార్థులను తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులకు పురస్కారాలు ఇవ్వటం అభినందనీయం అన్నారు. మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా గురుకులాలు అత్యున్నత విద్యా ఫలితాలు అందిస్తున్నాకానీ రాష్ట్ర ప్రభుత్వం సవతితల్లి ప్రేమ చూపటం బాధాకరం అన్నారు. కూటమి ప్రభుత్వం గురుకుల విద్యపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర గ్రంథాలయాల సంస్థ డైరెక్టర్ ఎ.కృష్ణ మోహన్ మాట్లాడుతూ విద్యాభివృద్ధిని సూచించే గ్రంథాలయాల వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. తాడికొండ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డి.మధుసూధనరావు మాట్లాడుతూ రాష్ట్రంలోనే తొలి గురుకుల పాఠశాల అయిన తాడికొండ రెసిడెన్షియల్ స్కూలు రాజధాని పరిధిలోనే ఉండటం ఆనందకరమని, దానిని పూర్వస్థితికి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామ న్నారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ వి.మరియరోజా మాట్లాడుతూ ఈకృషిని భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామని చెప్పారు.

మీకోసం వెబ్ సైట్‌లో అర్జీలు సమర్పించొచ్చు

గుంటూరు కలెక్టర్ అన్సారియా

ప్రజాశక్తి - గుంటూరు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లోనే కాకుండా అర్జీలను మీకోసం వెబ్‌సైట్‌లోను సమర్పించవచ్చని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీల వివరాలు Meekosam. ap.gov.in వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకోవచ్చన్నారు. అదే విధంగా అన్ని కార్యాలయాల్లో ప్రజల సమస్యలు సోమవారం స్వీకరిస్తారని తెలిపారు. అర్జీల నమోదు, నమోదైన అర్జీల స్థితి, వాటికి సంబంధించిన సమాచారం తెలుసుకోవటానికి 1100కి నేరుగా ఫోన్‌చేసి వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మల్యాద్రి



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని దుండగులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుండిమెడ గ్రామంలో చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని నిరసిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం అతి దుర్మార్గమైన చర్య అన్నారు. దళితుల మధ్య తగాదాలు పెట్టడానికి, ఐక్యతను దెబ్బతీసేందుకే ఇలాంటి దుర్మార్గమైన చర్యలు గుర్తు తెలియని వ్యక్తులు చేశారని ఆయన ఆవేదన చెందారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో మత ఘర్షణలు, కులాల మధ్య గొడవలు , దళితులపై దాడులు ఎక్కువగా జరుగు తున్నాయన్నారు. ఏపీలో కూడా దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. దళితులపై జరిగే దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ దళితులు అంటరానితనం, వివక్షకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. తక్షణమే చిత్తూరు జిల్లా, దేవళం పేట అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందన్నారు. నరేంద్ర మోడీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత మతోన్మాద బిజెపి మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా దుర్మార్గమైన చర్యలు చేపడుతుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజధాని పేరుతో 80000 ఎకరాల భూమిని తీసుకునేందుకు పూనుకోవడం జరిగిందన్నారు. ఇదే రాజధాని ప్రాంతంలో దళితులు భూములు కూడా ఉన్నాయని అన్నారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం రాజధానికి భూములు ఇచ్చిన రైతులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించ లేదన్నారు. అభివృద్ధి పేరుతోను, పరిశ్రమల స్థాపన పేరుతోను పాలక పక్షాలు సేకరిస్తున్న భూములలో దళితులవి కూడా ఉన్నాయన్నారు. బడ్జెట్‌లోనూ, నిధులు కేటాయింపులోనూ దళితులకు గిరిజనులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జోషి, కెవిపిఎస్ తాడేపల్లి మండల నాయకులు నాగ పోగు విజయ రాజు, బత్తుల సంసోన్, ఎం.చిన్న, ఎం.తంబి, జి.ఏసురత్నం, జి.చిన్నప్ప, ఎం.కృష్ణ, పవన్ పాల్గొన్నారు.

దళితులపై దాడులు సిగ్గుచేటు

ప్రజాశక్తి - తుళ్లూరు : స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లయినా దళితులు, బలహీనవర్గాలపై దాడులు జరగడం సిగ్గుచేటని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) జిల్లా కార్యదర్శి జె.నవీన్ ప్రకాష్ అన్నారు. కెవిపిఎస్ 28వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆదివారం తుళ్లూరులోని ప్రజా సంఘాల కార్యాలయం వద్ద కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం పతాకాన్ని సంఘం జిల్లా నాయకులు సిగినం కోటేశ్వర రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నవీన్ ప్రకాష్ మాట్లాడుతూ, పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్లనే దళితులపై నేటికీ దాడులు జరుగుతున్నా యన్నారు. అంబేద్కర్ రాజ్యాంగ రచన సందర్భంగా రాజకీయ సామాజిక ఆర్థిక సమానత్వం ద్వారానే దళితుల అభ్యున్నతి జరుగుతుందని ఆకాంక్షించారని, పాలకులు మాత్రం అందుకు భిన్నంగా స్వప్రయో జనాల కోసం రాజ్యాంగ హక్కులు దక్కకుండా దళితులు మరింత దిగజారేలా చేస్తున్నా రన్నారు. 1998లో ఆవిర్భవించిన కెవిపిఎస్ సమాజంలోని సాంఘీక దురాచారాలతో పాటు దళిత హక్కులు, ఎస్సి, ఎస్టి సబ్ ప్లాన్ సాధన కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన నినాదాలతో పోరాటాలు కొనసాగిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పేరం బాబూరావు, పాలడుగు భాగ్యరాజు, తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవిలో పారిశుధ్యం అధ్వానం

- మురుగునీరు పారుదల లేక ఇబ్బందులు
- కనీసం బ్లీచింగ్ కూడా చల్లని పంచాయతీ అధికారులు



ప్రజాశక్తి- మోపిదేవి : గ్రామపంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారై మురుగు నిలబడి ఆ నీటిలో విషపూరిత దోమలు వ్యాప్తి చెంది ప్రజల ఆరోగ్యానికి హానికరం చేసే విధంగా తయారవుతున్నాయి. మోపిదేవి మండల కేంద్రంలో ప్రతినిత్యం వందలాది బస్సులు వెళుతూ, ప్రయాణికులు కూర్చుని ఉండే ఆర్టీసీ బస్టాండ్ ఎదురుంగా మురుగునీరు నిలబడడంతో దుర్వాసనతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం గ్రామపంచాయతీ అధికారులు బ్లీచింగ్ కూడా చల్లడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే అవనిగడ్డలో డయేరియా అని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఇంకా కూడా స్థానిక అధికారులు మేల్కొనుకపోవడం స్థానిక ప్రజలు అగ్రహాన్ని ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయవలసి ఉండగా ఆ విధంగా చేయకపోవడం మురుగునీరు పేరుకుపోయి హానికర దోమలు వ్యాప్తి చెందుతున్నాయని పలువురు తెలుపుతున్నారు. ఇప్పటికైనా స్థానిక అధికారులు స్పందించి డ్రైనేజీలు బాగు చేయడంతో పాటు మురుగునీరు ఉన్నచోట బ్లీచింగ్ చెల్లి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

డ్రైనేజీల్లో పూడికలు తీయాలి
కోసూరు రామాంజనేయులు, జనసేన నేత, మోపిదేవి

మోపిదేవి మండల కేంద్రంలో డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారైంది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ,విదేశాల నుండి నిత్యం వేలాది మంది భక్తులు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానానికి వస్తారని, అటువంటి మహా పుణ్యక్షేత్ర ప్రదేశంలో ఈ విధంగా డ్రైనేజీ అస్తవ్యస్తంగా తయారవడం, మురుగు నీరు రోడ్డు మీద నిలబడడం చాలా బాధాకరం. డ్రైనేజీలు బాగు చేసి, పూడికతీత తీసి మురుగునీరు పారే విధంగా చర్యలు తీసుకోవాలి.



కొండలమ్మను దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం సందర్భంగా యాత్రికులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. సుమారు 30 వేల మంది యాత్రికులు శ్రీ అమ్మవారిని దర్శించుకొని పాలపొంగళ్ళు సమర్పించి వారి మొక్కుబడులు తీర్చుకున్నారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్ లు దేవస్థానములో ఏర్పాట్లను పర్యవేక్షించారు. గుడివాడకి చెందిన అంబిక జ్యువలరీ అండ్ సిల్వర్ మెటీరియల్స్ షాప్ ప్రొప్రైటర్ రాజు సోని దంపతులు అమ్మవారికి సుమారు 24 వేల రూపాయల విలువ గల ముక్కుపుడకను దేవస్థానం చైర్మన్ మోహన్ ద్వారా అందజేశారు.



బోర్ వెల్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

టిడ్కో కాలనీలో బోర్‌వెల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - గుడివాడ : గత పాలకుల అనాలోచిత నిర్ణయాలతో అస్తవ్యస్తంగా తయారైన టిడ్కో కాలనీని ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ఆదివారం స్థానిక టిడ్కో కాలనీలో రూ.40 లక్షల నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన 10 హెచ్.పి. సామర్థ్యం కలిగిన పవర్ బోర్ వెల్స్‌ను వెనిగండ్ల రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో కాలనీ నివాసితులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా అన్ని విధాలుగా కషి చేస్తున్నానన్నారు. ప్రాధాన్యత ప్రకారం శానిటేషన్, డ్రైనేజీ, తాగునీరు ఇలా ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య మెరుగుకు పదిమంది శానిటేషన్ సిబ్బందిని నియమించామని, భవిష్యత్తులో వారి సంఖ్యను పెంచుతామన్నారు. అస్తవ్యస్తంగా ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మరమ్మతులకు ఆధునిక యంత్రాలతో ప్రత్యేక చర్యలు తీసుకుంటు న్నామన్నారు. ప్రస్తుతం రూ.40 లక్షల నిధులతో ఐదు బోర్ వెల్స్ వేసామని, మరిన్ని నిర్మించేందుకు మరో 30 లక్షలు నిధులు మంజూరు అయ్యాయన్నారు. ప్రజలకు రెండు పూటల నీటిని సరఫరా చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్, జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, టిడిపి నాయకులు చేకూరు జగన్మోహన్రావు, మున్సిపల్ ఎం.ఈ ప్రసాద్, డిఇ శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : మచిలీపట్నం టౌన్ హాల్ వెనుక బుట్టాయిపేట మహాత్మ జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో రోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. ప్రతి రెండు నెలలకోసారి మొదటి ఆదివారం నిర్వహించే క్యాంపు లో మధుమేహం, రక్తపోటు, మూర్ఛలు, పక్షవాతం సంబంధించిన వైద్యనిపుణులు పాల్గొని సేవలందిస్తారు. విజయవాడ ప్రజా వైద్యశాలకు చెందిన డాక్టర్ మాకినేని కిరణ్, పామర్రు నుంచి డాక్టర్ సురేష్ చంద్రారెడ్డి, మచిలీపట్నం నుంచి సీనియర్ వైద్యులు కుప్ప రామశాస్త్రి రోగులను పరీక్షించి రెండు నెలలకు సరిపడా మందులు సూచించారు. ఈ శిబిరంలో వివిధ సమస్యలపై 275 మంది రోగులను పరిక్షించి మందులు అందించారు. స్వర్గీయ గోపాలం భ్రమరాంబ రామస్వామి దంపతుల కుమారుడు డాక్టర్ గోపాలం శివన్నారాయణ ఆధ్వర్యంలో నడిచే జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో ఈ క్యాంపులో పాల్గొనే రోగులకు నాణ్యమైన మందులు అందిస్తున్నారు. పెనుబోతు వెంకటేశ్వరరావు స్మారక రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహణ బాధ్యతలను కన్వీనర్ పామర్తి నాగయ్య సమర్ధవంతంగా నిర్వహించారు. సిపిఎం శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు స్వచ్ఛంద వాలంటీర్లు గా అందించారు. ఆదివారం ఉదయం ఐదు గంటలకే ప్రారంభమైన మెడికల్ క్యాంపు మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది.మళ్లీ డిసెంబర్ 7వ తేదీన క్యాంపు ఉంటుందని ప్రజలకు అర్థమయ్యేలా జ్యోతిబాపూలే ప్రాంగణంలో కరపత్రాలు అంటించి రోగులకు అవగాహన కల్పించారు.ఈ వైద్య శిబిరంలో విజయవాడ నుంచి ప్రజా వైద్యశాల డాక్టర్ చావా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వైద్య శిబిరంకు హాజరైన రోగులు



ప్రిన్సిపల్ పూర్ణచంద్రారెడ్డిని సన్మానిస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల

సమాజానికి గురువులే దిక్సూచి : ఎంఎల్ఎ వర్ల

ప్రజాశక్తి-పామర్రు : మంచి సమాజ నిర్మాణానికి గురువులు దిక్సూచి వంటివారని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం స్థానిక ఏఎన్ఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్సా) ఆధ్వర్యంలో శనివారం రాత్రి గురుదేవోభవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం జిల్లాలోని పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులకు ఆయన తన చేతుల మీదుగా పురస్కారాలను అందించి వారిని అభినందించారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, స్కూల్ ప్రిన్సిపల్ ఏ.పూర్ణచంద్రారెడ్డి, ఎంఈఓ 2 జి. పద్మవాణి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక హితం పబ్లిక్ స్కూల్లో జరిగిన అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పామర్రుకు చెందిన ఘంటసాల-ఎన్టీఆర్ కళాపీఠం ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో కళా పీఠం అధ్యక్షుడు కాటూరు వెంకట మురళీకష్ణ, కార్యదర్శి హేమంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్‌ను కలిసిన ఎంఎల్ఎ బుద్ధప్రసాద్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్‌ను అమరావతిలోని ఉపముఖ్యమంత్రి కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా తాను రచించిన 'సదాస్మరామి' గ్రంథాన్ని బహుకరించినట్లు బుద్ధప్రసాద్ చెప్పారు. తెలుగు జాతిలో జన్మించిన మహోన్నత ప్రముఖులను స్మరించుకుంటూ ఈ గ్రంథం రచించినట్లు బుద్ధ ప్రసాద్ తెలిపారు. తెలుగుజాతిలో స్ఫూర్తిగా నిలిచే మహోన్నత వారస త్వాన్ని భావితరాలకు అందించేందుకు ఈ గ్రంథం రచించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా నియోజక వర్గంలో పలు అభివద్ధి పనులపై ఆయనతో చర్చించారు త్వరలో నియోజకవర్గంలోని ఎదురుమొండి దీవుల్లో జరిగే పలు అభివద్ధి పనులకు పవన్ కళ్యాణ్ ను విచ్చేయనున్న సందర్భంగా పర్యటన గురించి ఆయనతో చర్చించామన్నారు.



పవన్‌కళ్యాణ్‌తో బుద్ధప్రసాద్

గన్నవరంలో మాజీ ప్రధానమంత్రుల విగ్రహాలకు స్థలం కేటాయింపు

ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) : గన్నవరంలో మాజీ ప్రధానమంత్రులు జవహర్లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల విగ్రహాలను పునఃస్థాపించడానికి 1.5 సెంట్ల స్థలం స్థలం కేటాయించారు. రహదారి విస్తరణ, సుందరీకరణ పనుల కారణంగా గాంధీ బొమ్మ సెంటర్ నుండి పోలీస్ స్టేషన్ వరకు ఉన్న ఈ ముగ్గురు మాజీ ప్రధానమంత్రుల విగ్రహాలను తాత్కాలికంగా తొలగించారు. ఈ తొలగింపు తర్వాత, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ వారి విగ్రహాలను అదే ప్రాంతంలో పునఃస్థాపించడానికి హామీ ఇచ్చారు. ఈ మేరకు, ఎమ్మెల్యే వెంకట్రావు ప్రత్యేక చొరవ తీసుకుని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా ప్రాంతంలో 1.5 సెంట్ల స్థలాన్ని విగ్రహాల కోసం కేటాయించడానికి అనుమతులు మంజూరు చేయించారు. విగ్రహాల ఏర్పాటు కోసం అవసరమైన గ్రానైట్ దిమ్మెల నిర్మాణానికి గ్రామ పంచాయతీ నుండి నిధులను కూడా మంజూరు చేయించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వెంకట్రావ్ ఆదివారం ఉదయం ఈ స్థల కేటాయింపు ఉత్తర్వులను ఎఐసిసి సభ్యులు దనేకుల మురళీమోహన్, కృష్ణా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు గోల్లు కృష్ణలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు తమలం జాన్సీ రాణి, గన్నవరం మండల కాంగ్రెస్ అధ్యక్షులు గోగులముడి రవీంద్ర తదితరులు



స్థల కేటాయింపు ఉత్తర్వులు అందిస్తున్న ఎంఎల్ఎ

రేపటి నుంచి ఆటల పోటీలు

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఈ నెల 7, 8 తేదీలలో ఉంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిహెచ్. అనిత తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ పోటీలలో మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొనవచ్చునని చెప్పారు. పాల్గొనదలచిన విద్యార్థులు తమ పాఠశాల అనుమతి, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీలను తప్పనిసరిగా తీసుకురావాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం మండల విద్యాశాఖ అధికారి 1,2 ల ఆధ్వర్యంలో, పాఠశాల కోఆర్డినేటర్, విద్యా కమిటీ తనిఖీలో నిర్వహిస్తున్నట్లు వివరించారు.

బంతిపూల సాగుతో లాభాలు



ప్రజాశక్తి-వత్సవాయి

బంతి పూలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటుంది. పసుపు, నారింజ, ఎరుపు వంటి ఆకర్షణీయమైన రంగులో కనువిందు చేసే ఈ పూల పంటను సంవత్సరం పొడుగునా సాగు చేయవచ్చు. ప్రణాళికతో పంట సాగు చేసి చిన్నచిన్న మెళకువలు పాటిస్తే పుష్కలంగా దిగుబడి వస్తుంది. సాధారణంగా బతుకమ్మ, వినాయక చవితి, దసరా, దీపావళి వేడుకల్లో బంతి పూలు విరివిగా వాడుతుంటారు. ఆయా పండుగలే టార్గెట్‌గా రైతులు బంతిపూలు సాగు చేపడుతున్నారు.

ఇటీవల కాలంలో తెలంగాణతోపాటు ఆంధ్ర ప్రాంతంలో కూడా మహిళలు బతుకమ్మ ఆటలు విశేషంగా ఆడుతున్నారు. ఈ పండగకు పూలే కీలకం కావడంతో రైతులు పూల సాగుపై దృష్టి పెడుతున్నారు. ఇటీవల కొందరు రైతులు సంప్రదాయ పంటలైన మిర్చి, పత్తి తదితర పంటలు సాగు చేసిన నష్టపోవడంతో బంతిపూల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. తక్కువ వ్యవధిలో, తక్కువ పెట్టుబడితో బంతిపూల సాగు అధిక లాభాలనిస్తుంది.

పెనుగంచిప్రోలు మండలంలోని పెనుగంచిప్రోలు, కొల్లికొళ్ల, కొపన్నవరం గ్రామాలతో పాటు వత్సవాయి మండలంలో వత్సవాయి, మక్కపేట తదితర గ్రామాల్లో రైతులు బంతిపూల సాగు చేపట్టి లాభాలు అందుకుంటున్నారు. ఎకరం సాగుకు రూ.25 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. నారు నాటిన రెండు నెలల్లో పూలు కోతకు వస్తాయని, రెండు నెలల వరకు ఎకరానికి రోజుకు కింటాల్ పూలు వస్తాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ఒకటి, రెండు కిలోలు అయితే కిలో రూ.70 నుంచి రూ.80లకు తోట దగ్గరే విక్రయిస్తున్నామని, 50 కిలోలు పైన అయితే కిలో రూ. 50 నుంచి రూ.60లకు ఇస్తున్నామని రైతులు తెలిపారు. బతుకమ్మ సీజన్‌లో మంచి ఆదాయం వస్తుందని అంటున్నారు.

మార్కెటింగ్ సహకారం అవసరం
గురేటి దాస్, రైతు



రైతులకు ప్రభుత్వం నారు సరఫరాతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తే బంతిపూల సాగు రైతుకు మరింత లాభసాటిగా ఉంటుంది. ప్రకృతి సహకరిస్తే రోజుకు ఎకరానికి కింటా దిగుబడి వస్తుంది. ఎకరానికి రూ.25 వేలు పెట్టాను. కొందరు పొలం వద్దే పూలు కొంటుండగా, మిగతా పూలు మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్ముతున్నా.



త్వరలో బిఎస్ఎన్ఎల్ 5జి సేవలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : బిఎస్ఎన్ఎల్ 5జి సేవలను త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామనిబిఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యులు బాబూరావు తెలిపారు. ఆదివారం రెడ్డిగూడెంలో బాబూరావు పర్యటించారు. రెడ్డిగూడెం ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్ సేవల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్ ఓనర్ ముప్పిడి నాగేశ్వరరెడ్డితో సమావేశమై టెలికాం టవర్, నెట్‌వర్క్ మెరుగుదల, కస్టమర్ సదుపాయాల విస్తరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే బిఎస్ఎన్ఎల్ 5జి సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని, గ్రామీణ ప్రాంతాలకు అధునాతన సాంకేతికత అందించడమే తమ లక్ష్యమని తెలిపారు.



నిబద్ధతతో పని చేసేవారికే పదవులు : వైసిపి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండల, గ్రామ స్థాయిలో నూతనంగా ఏర్పాటు చేయనున్న పార్టీ కమిటీలలో నిబద్ధతతో పనిచేసే వారికి ప్రాధాన్యతనిస్తామని వైసిపి జగ్గయ్యపేట నియోజకవర్గ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు తెలిపారు. శనివారం రాత్రి పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు బూడిద నరసింహారావు అధ్యక్షతన మండల స్థాయి వైసిపి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట మండల స్థాయిలో పార్టీ కమిటీల నియామకం త్వరితగతిన పూర్తి చేయాలని, పార్టీ బలోపేతానికి మండల, గ్రామ స్థాయి నాయకులు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మండవ శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కార్యదర్శి మట్టా ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి పసుపులేటి సత్య శ్రీనివాసరావు, రాష్ట్ర చేనేత విభాగ అధికార ప్రతినిధి పెంటి శ్రీనివాసరావు, రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి నంబూరి రవి, రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి శివరాత్రి పథ్వీరాజ్, పాల్గొన్నారు.

విజయవాడ అభివృద్ధిలో జైనుల పాత్ర కీలకం
ఎంపి కేశినేని శివనాథ్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని వన్‌టౌన్ ప్రాంతం (తమ్మినవారి వీధి) జైన్ టెంపుల్ వీధిలో ఆదివారం శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తి పూజక్ సంఘం ఆధ్వర్యంలో మెగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి, పాదచారులకు ఆహారం వడ్డించారు. శ్రీ సంభవనాథ్ జినాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎంపి మాట్లాడుతూ విజయవాడ నగర అభివృద్ధి, వాణిజ్య రంగం, సామాజిక సేవల్లో జైనుల పాత్ర అపూర్వమని, సమాజ సేవలో జైన సమాజం చూపిస్తున్న తపన ప్రశంసనీయమైందన్నారు. గన్నవరం విమానాశ్రయం నుంచి అహ్మదాబాద్‌కు ప్రత్యేక విమాన సర్వీసును త్వరలోనే ప్రారంభిస్తున్నట్లు ఎంపీ తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యక్షులు జయంతి లాల్, అశోక్ కుమార్, కార్యదర్శి పన్నాలాల్, సహాయ కార్యదర్శి భోగిలాల్, కోశాధికారి దుంగర్ మన్, పాల్గొన్నారు.

రోడ్డు వేశారు.. మట్టి పోయడం మరిచారు

ప్రజాశక్తి - తిరువూరు

గ్రామీణ ప్రాంతాల్లో మట్టి రోడ్లతో ప్రజలు నరక యాతనపడుతున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం గ్రామాల్లో సిసి రోడ్లు వేసి వారి జీవన ప్రమాణాలు పెంపొందించేందుకు కృషి చేస్తోంది. అందులో భాగంగా ఎస్‌డిఎఫ్, పంచాయతీరాజ్‌శాఖ, ఎన్ఆర్ఇజిఎస్ నిధులు ద్వారా సిసి రోడ్లను నిర్మిస్తోంది. ఈ రోడ్ల నిర్మాణ పనుల్లో కాంట్రాక్టర్లు సిసి రోడ్లు వేస్తున్నారేగానీ ఆ రోడ్లకు ఇరువైపులా (రోడ్డు సైడ్ బర్మ్‌లకు) మట్టి పోయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

తిరువూరు మండలంలోని కొమ్మిరెడ్డిపల్లి దళితపేట మెయిన్ రోడ్డుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.10 లక్షలతో 120 మీటర్ల మేర సిసి రోడ్డు నిర్మాణం చేపట్టి ఏడాదైంది. ఆ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఈ రోడ్డు నిర్మాణ పనులను కాంట్రాక్టరు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేశారు. కానీ అప్పటి నుంచి నేటి వరకు రోడ్డు సైడ్ బర్మ్‌లకు మొరం మట్టి పోయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆటోలు, స్కూల్ బస్సులు, ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై రాకపోకలు కొనసాగించే సమయంలో ఎదురెదురుగా వచ్చినప్పుడు తప్పుకునే క్రమంలో కిందపడి అనేక మంది గాయాలపాలవుతున్నారు. సంబంధిత



సిసి రోడ్డుకు మట్టి పోయకుండా వదిలేసిన కాంట్రాక్టర్

అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని ఆ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు వేసి చేతులు దులుపుకున్నారుగానీ ఇరువైపులా మట్టి పోయాలనే ఆలోచన కాంట్రాక్టర్‌కు గానీ, పోయించాలనే బాధ్యత అధికారులకు లేకపోవటం పట్ల దళిత పేట ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్ శాఖ తిరువూరు మండల ఏఈ కృష్ణారావును వివరణ అడగగా రోడ్డు వేసి సంవత్సరం అవుతుందని, సైడ్ బర్మ్‌లకు గ్రావెల్ తోలమని కాంట్రాక్టర్‌కు చెబుతూనే ఉన్నామని ఏఈ తెలిపారు. బిల్లు వచ్చిన తర్వాత తోలతానని కాంట్రాక్టర్ చెబుతున్నట్లు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-మైలవరం :మండలంలోని వెలవడం విద్యుత్‌సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి తోలుకోడు విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గణపవరం విద్యుత్ అసిస్టెంట్ ఇంజనీర్ రామ్మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయటం జరుగుతుందని, విని యోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వైసిపి రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శిగా ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: వైసిపి రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శిగా బూదవాడ గ్రామానికి చెందిన మట్టా ప్రతాప్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలోని వైసిపి కార్యాలయంలో మట్టా ప్రతాప్‌రెడ్డిని వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆదివారం సన్మానించి అభినందనలు తెలిపారు.

జన ఔషధి షాపును వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జన ఔషధి జనరిక్ మందుల దుకాణాన్ని వినియోగించుకోవాలని సొసైటీ అధ్యక్షుడు యానాల గోపీచంద్ కోరారు. కృష్ణ రైతు సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో అయ్యప్పనగర్‌లోని కృష్ణా రైతు సేవ సహకార సంఘం భవనంలో నిర్వహిస్తున్న జన ఔషధి మందుల దుకాణాన్ని ఆయన ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ.. బహిరంగ మార్కెట్లో కంటే జన ఔషధి మందుల షాపులో ధరలు 30 -40 శాతం తక్కువ ధరకే దొరుకుతాయని, అన్ని బ్రాండ్లకు సంబంధించి జనరిక్ ఔషధాలు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. జన ఔషధి ద్వారా తక్కువ ధరకే మందులను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఎండి కనపర్తి నారాయణరావు, పాల్గొన్నారు.

సిపిఎం నాయకుల నివాళి


ప్రజాశక్తి- నందిగామ



సిపిఎం సభ్యులు, డివైఎఫ్ఐ యువజన నాయకులు జక్కులూరి రవి తల్లిదండ్రులకు సిపిఎం నాయకులు ఆదివారం నివాళులర్పించారు. ఇటీవల జక్కులూరి రవి తల్లి మరియమ్మ మృతి చెందారు. రవి తండ్రి వీరయ్య కూడా కొద్ది నెలల క్రితం మరణించారు. ముచ్చింతాల గ్రామంలో వీరయ్య, మరియమ్మ చిత్ర పటాలకు సిపిఎం నందిగామ కార్యదర్శి కటారపు గోపాల్, సిపిఎం మండల కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం, రవి శేఖర్, శ్రీనివాసరావు, ఎవి నారాయణ తదితరులు నివాళులు అర్పించారు. రవి కుటుంబానికి ధైర్యం చెప్పారు.

పందులు, కోతులతో రైతులకు వ్యధ

ప్రజాశక్తి- నందిగామ



అన్నదాతలు ఇప్పటికే అధిక వర్షాలతో నష్టపోగా.. ప్రస్తుతం పంట చేతకొచ్చే సమయంలో పందులు, కోతులు పంటలను ధ్వంసం చేస్తుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలోపడ్డారు. నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలంలోని పలు గ్రామాల్లో కోతులు, పందుల బెడద తీవ్రంగా ఉండడంతో భయాందోళనకు గురవుతున్నారు. పంట పొలాల మీద దాడి చేస్తూ మిరప, పత్తి, మొక్క జొన్న, కూరగాయలు, తోటలను నాశనం చేస్తూ రైతులకు నష్టం కలిగిస్తున్నాయి. రైతులు పొలాల వద్ద ఏ పంట వేసినా దక్కకుండా కోతులు, పందులు నాశనం చేసుతన్నాయని రైతులు వాపోతున్నారు. కోతులు, పందుల బెడద వల్ల పంటలు వేసుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినా ఇంతవరకు సమస్యకు పరిష్కారం చూపలేదు. ఇప్పటికైనా జిల్లాలోని ఉన్నతాధికారులు స్పందించి రైతులు సాగు చేసుకుంటున్న పంటలను కాపాడాలని చందర్లపాడు మండలంలోని అనేక గ్రామాల రైతులు కోరుతున్నారు. ఇప్పటికే చాలామంది రైతులు పందులు, ఆవులు, కోతులు బారి నుండి తమ పంటలను కాపాడుకోలేక ఎక్కువ మంది మిరప, పత్తి సాగును విరమించి సుబాబుల్, జామాయిల్‌ను భారీ ఎత్తున సాగు చేస్తున్నారు. దీని వల్ల మండలంలోని అనేక గ్రామాల రైతాంగానికి సంబంధించిన పంట పొలాల్లో వ్యవసాయ కూలీలకు పనుల్లేక ఖాళీగా ఉంటున్నారు. ఆయా కుటుంబాలలోని ఆర్థిక పరిస్థితులు ఎదుర్కొంటున్నారు.



కలపపై జిఎస్‌టిని తగ్గించాలి

ప్రజాశక్తి-పమిడిముక్కల : కేంద్ర ప్రభుత్వం ఒకే దేశం ఒకే పన్ను విధానంతో తీసుకువచ్చిన జిఎస్‌టిని 18, 5 శాతానికి తగ్గించడంపట్ల ప్రజలకు మేలు జరుగుతుందని బిస్మిల్లా టింబర్ డిపో అధినేత సయ్యద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ జీఎస్టీని కలపపై కూడా 18 శాతం నుండి ఐదు శాతానికి తగ్గిస్తే సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా గహాల నిర్మాణం చేపడతారన్నారు. తాడంకి గ్రామంలో బిస్మిల్లా టింబర్ డిపోలో టేకు, వేప, బండారు గుగ్గిలం సరసమైన ధరలకే లభిస్తుందన్నారు. తాడంకి గ్రామములో ఎన్నో సంవత్సరాలుగా టింబర్ డిపో వ్యాపారం కొనసాగిస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండలంలోని తొమ్మిది గ్రామాలకు సోమవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్న విద్యుత్ ఈఈ జి.బి.శ్రీనివాసరరావు విలేకరులకు తెలిపారు. 33/11 కె.వి. కౌతవరం సబ్ స్టేషన్‌లో 11కె.వి. ఫీడర్ పరిధిలోని కౌతవరం, వడ్లమన్నాడు, వేమవరం, వేమవరప్పాలెం, రెడ్డిపాలెం, గాదేపూడి, ఉలవలపూడి, పద్మాలపాలెం, భీమునిగుంట గ్రామాలలో విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లను కొడుతున్నా మన్నారు. దీంతో ఆయా గ్రామాల్లో ఆ సమయంలో గహ, వాణిజ్య, ఆక్వా విద్యుత్ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందన్నారు. కావున ప్రజలు సహకరించాలని ఈఈ శ్రీనివాసరరావు కోరారు.

కూడేరు గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



ప్రజాశక్తి-పమిడిముక్కల : కూడేరు గ్రామాభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, గ్రామంలో తాగునీరు, విద్యుత్తు, రోడ్లు మౌలిక వసతులు కల్పిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ వీర్ల నాగరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో 19 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు నిర్మాణం చేపట్టా మన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్నామని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం గ్రామ సర్పంచ్‌గా సంక్షేమ కార్యక్రమాలు నెరవేస్తున్నామని తెలిపారు. అలాగే ఐలూరు-కృష్ణాపురం రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తున్నామని ఆయన అన్నారు.

పెన్షనర్ల అసోసియేషన్‌కు సహకారం అందిస్తా : విక్కుర్తి

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివి యూనిట్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషనుకు అన్ని విధాల తోడ్పాటు అందిస్తానని ప్రముఖ పారిశ్రామికవేత్త, కూటమి నాయకులు, విక్కుర్తి వీర రాఘవయ్య ఫౌండేషన్ చైర్మన్ విక్కుర్తి వెంకట శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. .అవనిగడ్డలోని దివి యూనిట్ పెన్షనర్స్ బిల్డింగ్ కార్యాలయంలో ఆదివారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. దివి యూనిట్ అధ్యక్షులు ఎం రామకష్ణ ఆధ్వర్యంలో కార్యదర్శి అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి సంఘ కార్యక్రమాలను అలాగే పెన్షనర్స్ అసోసి యేషన్కు శ్రీనివాస్ అందిస్తున్న సహాయ సహకారా లను అబ్దుల్ అజీజ్ విపులంగా వివరించారు. ఉత్తమ ఉపాధ్యాయు లుగా అవార్డు అందుకోవడానికి ఉపాధ్యాయులు చేసిన కషిని వెల్లడించారు. ఫన్షనర్స్ సంఘానికి తన పూర్తి అండదండలు ఎల్లప్పుడూ ఉంటాయని ఈసందర్భంగా శ్రీనివాస్ చెప్పారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యా యులుగా అవార్డులు అందుకున్న తుంగల చంద్రశేఖర్, కొమ్మినేని ఉదయ్ కుమార్ లను శ్రీనివాస్‌తో పాటు పలువురు సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఇటీవల పదవి విరమణ పొందిన ఉద్యోగులు ఎస్‌బిబివి ప్రసాద్, మద్ది వెంకటేశ్వరరావు. బి. సాంబశివరావు, బూసి రాజు వెంకటేశ్వరరావు, రావి సునీత, కుక్కల రాజేంద్రప్రసాద్, సనక వెంకటస్వామి, ఎం. లక్ష్మీనారాయణ, కె. పూర్ణచంద్రరావు, టీవీ సుబ్రహ్మణ్యం, పి. శేషయ్యలను శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు



పెన్షనర్లను సత్కరిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజా సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-మొవ్వ : సిపిఎం మొవ్వ మండల కమిటీ సమావేశం ఆదివారం మండలంలో చినముత్తేవి గ్రామంలో అజయ్ కుమార్ భవనంలో బొల్లా సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోసూరు శివ నాగేంద్రం హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కౌలుదార్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, రైతాంగానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రొఫెసర్ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలను ప్రకటించటం లేదని, మరోపక్క కాంప్లెక్స్ ఎరువులు విపరీతంగా పెంచి రైతులను నష్టపరుస్తున్నారని విమర్శించారు. అలాగే మొవ్వ పాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, గ్రామాల్లో ఇల్లు లేని పేదలను గుర్తించి ఎన్నికల్లో వాగ్దానం చేసిన మూడు సెంట్లు ఇళ్ళ స్థలం వెంటనే కేటాయించి గహ నిర్మాణాలు చేయాలని కోరారు. అలాగే మండలంలో ప్రధానంగా దెబ్బతిన్న జిల్లా పరిషత్ రోడ్లను నిర్మాణం చేయాలని మండల కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో మండల కార్యదర్శి శీలం నారాయణరావు, కాకి రాజశేఖర్, కొడాలి కరుణాకర్ రావు, ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి శ్రీనివాసరావు కొనకళ్ళ రాంబాబు, సిహెచ్ సుబ్రహ్మణ్యేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సుమారు 80 మందికి వైద్య సేవలు అందించినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు యలమంచిలి నాగేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక పామర్రు రోడ్డులోని కోతి బొమ్మ సెంటర్ వద్ద ఆర్సీఎం చర్చి ఎదురుగా ఉన్న ప్రభావతి గార్డెన్స్‌లో ఆదివారం జరిగిన ఉచిత మెడికల్ క్యాంపులో ఆర్థోవిభాగం, జనరల్ మెడిసిన్ సంబంధిం చిన పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చలసాని చౌదరి రాయన్ జ్ఞాపకార్థం ప్రతినెల 1వ, 3వ ఆదివారాల్లో ఈ క్యాంపు నిర్వహిస్తున్నట్లు, డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కాలేజీ ఆర్థోపెడిక్ వైద్యులు, జనరల్ మెడిసిన్ వైద్యులు ద్వారా ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గుళ్లపల్లి కిరణ్ బాబు, బి శంకర్రావు, డి జ్యోతేశ్వరరావు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ చైతన్య, నర్సింగ్ విద్యార్థినిలు, ఫార్మసీ అసిస్టెంట్ రాధిక, గుంతా చంద్రశేఖర్ (బుల్లి) తదితరులు పాల్గొన్నారు.



ఉచిత మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్న దృశ్యం

'విద్యావికాస్' డైరెక్టర్, హెచ్‌ఎంలకు పురస్కారాలు

ప్రజాశక్తి - గుడివాడ : విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, విద్యావికాస్ హైస్కూల్ హెడ్ మాస్టర్ మాజీ ఎంఇఒ చాట్రగడ్డ నాగమల్లేశ్వర రావులు అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గౌరవ పురస్కారాలు అందుకున్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం రాత్రి పామర్రు ఎయన్‌యమ్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ డెమోక్రటిక్ వారు ఏర్పాటు చేసిన గురుదేవోభవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పామర్రు ఎమ్.ఎల్.ఏ వర్ల కుమార్ రాజా విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావును సన్మానించారు. అలాగే అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ముదినేపల్లి గ్రామ ప్రముఖ వైద్యులు డాక్టర్ అంబుల మనోజ్ ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిచే మాజీ ఎంఇఒ ప్రస్తుత విద్యావికాస్ హైస్కూల్ హెడ్ మాస్టర్ చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావును సన్మానించారు. ఈ సందర్భంగా విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు, హెడ్మాస్టర్ చాట్రగడ్డ నాగమల్లేశ్వరరావులను విద్యావికాస్ ఉపాధ్యాయులు, చిన్నారులు, వారి తల్లిదండ్రులు అభినందించారు.



విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే వర్ల



విద్యావికాస్ హెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి

దోషులు ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలి

- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మల్యాద్రి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన గుర్తు తెలియని దుండగులను ఎంతటి వారైనా కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని గుండిమెడ గ్రామంలో చిత్తూరు జిల్లాలో అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని నిరసిస్తూ కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. కెవిపిఎస్ మండల కార్యదర్శి పల్లె కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షులు మాల్యాద్రి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం అతి దుర్మార్గమైన చర్య అన్నారు. దళితుల మధ్య తగాదాలు పెట్టడానికి, ఐక్యతను దెబ్బతీసేందుకే ఇలాంటి దుర్మార్గమైన చర్యలు గుర్తు తెలియని వ్యక్తులు చేశారని ఆయన ఆవేదన చెందారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 11 సంవత్సరాల కాలంలో మత ఘర్షణలు, కులాల మధ్య గొడవలు, దళితులపై దాడులు ఎక్కువగా జరుగు తున్నాయన్నారు. ఏపీలో కూడా దళితులపై దాడులు విపరీతంగా పెరిగాయని ఆయన అన్నారు. దళితులపై జరిగే దాడులను అరికట్టడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. 79 సంవత్సరాల స్వతంత్ర భారత దేశంలో నేటికీ దళితులు అంటరానితనం, వివక్షకు గురి అవుతున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు జోషి, కెవిపిఎస్ తాడేపల్లి మండల నాయకులు నాగ పోగు విజయ రాజు, బత్తుల సంసోన్, ఎం.చిన్న, ఎం.తంబి, జి.ఏసురత్నం, జి.చిన్నప్ప, ఎం.కృష్ణ, పవన్ పాల్గొన్నారు.

నేడు కేంద్ర మంత్రి రాక

ప్రజాశక్తి - మంగళగిరి : పట్టణంలోని రాయల్ కన్వెన్షన్‌లో సోమవారం జరిగే ఉచిత వినికిడి మిషన్ నమోదు కార్యక్రమానికి కేంద్ర మంత్రి రామదాస్ అత్వాలే హాజరు కానున్నారని ఆర్‌పిఐ(ఏ) పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మారెడ్డి బ్రహ్మానంద రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మహిళ అధ్యక్షురాలు సీమ అత్వాలే హాజరవుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెముడు పరీక్ష చేసి వినికిడి లోపం ఉన్నవారికి మిషన్ ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

306వ రోజుకు కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : చట్టపరంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆది వారం నా టికి 306వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ కార్యదర్శి కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమస్య పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరైనది కాదని విమర్శించారు. చర్చల ద్వారా సమస్యను పరిష్కరించి తన శతశుద్ధిని నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. దీక్షల్లో జి.వెంకటేశ్వర్లు, బి.సూర్యప్రకాష్, వై.సాంబశివరావు, డి.నాగేశ్వరరావు కూర్చున్నారు. కార్యక్రమంలో నాగేశ్వరరావు, గురవయ్య, అంకయ్య, జానీ బాషా, ఆశీర్వాదం పాల్గొన్నారు.



కౌన్సిల్లో కార్మికుల సమస్యలపై మాట్లాడతా..



మినిస్టర్ వైట్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విజయవాడ నగరంలో పురుషుల సంప్రదాయ దుస్తులలో విశ్వసనీయ బ్రాండ్‌గా పేరుగాంచిన మినిస్టర్ వైట్ తన 57వ ఎక్స్ క్లూజివ్ బ్రాండ్ అవుట్లెట్‌ను ప్రారంభించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎపిలో వ్యాపారరంగం అభివృద్ధి చెందిందని, భారత్‌లోనే వస్త్ర రంగంలో తనదైన ముద్రవేసిన మినిస్టర్ వైట్ విజయవాడలో తమ తొలి అవుట్లెట్ ప్రారంభించడం అభినందనీయమని సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా పేర్కొన్నారు. అత్యాధునిక బ్రాండెడ్ వస్త్రాలు కలిగిన మినిస్టర్ వైట్‌ను నగర వాసులు సందర్శించాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రకాశం రోడ్‌లో ఏర్పాటు చేసిన మినిస్టర్ వైట్ 57వ ఎక్స్ క్లూజివ్ బ్రాండ్ అవుట్లెట్‌ను మినిస్టర్ వైట్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ సురేష్ రామసుబ్రహ్మణ్యంతో కలిసి ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... మినిస్టర్ వైట్ ప్రత్యేకమైన పంచెలు, షర్టులు, కలర్ ఫుల్ షర్ట్-పంచె కాంబోలు, పండుగల కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసిన కుర్తాలు, మెరుగైన ఫ్యాబ్రిక్స్ స్థానిక ప్రజలకు మరింత చేరువవుతున్నాయనీ చెప్పారు. ఈ కొత్త షోరూం ద్వారా విజయవాడ కస్టమర్లకు మరింత చేరువ అవ్వడమే లక్ష్యంగా మినిస్టర్ వైట్ నూతన అవుట్లెట్ ప్రారంభించడం జరిగిందని చెప్పారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం టిడిపి ఫ్లోర్ లీడర్ నెలిబండ్ల బాలస్వామి మాట్లాడారు.. ఈ షోరూం దినదినాభివద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.



కొండపల్లిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: ఎన్‌టిటిపిఎస్ కాలుష్య కోరల్లో చిక్కి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజల కోసం కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించాలని వైసిపి ఫ్లోర్ లీడర్ గుంజ శ్రీనివాసు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజన్ 2047లో భాగంగా సిఆర్‌డిఎ అధికారులు ఆదివారం కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిలర్‌లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టారు. ఫ్లోర్ లీడర్ శ్రీనివాసు మాట్లాడుతూ గాలి, నీటి కాలుష్యం వల్ల ప్రజలు గుండె జబ్బులు, క్యాన్సర్, ఊపిరితిత్తులు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నారని, కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవడంతోపాటు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అవసరమని తెలిపారు. పర్యాటకుల సంఖ్య పెరిగేలా కొండపల్లి ఖిల్లా కోటను మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. మెట్ల మార్గాన్ని అభివృద్ధి చేయాలని, పర్యాటకులను ఆకర్షించే విధంగా ఖిల్లాపైకి రోప్ వే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొండపల్లి బొమ్మల కళాకారుల అభివద్ధికి మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని, వారి జీవన ప్రమాణాలు మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

- సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు
- మూడో రోజుకు చేరిన అంబేద్కర్ స్మృతివనం కాంట్రాక్ట్ కార్మికుల ఆందోళన

ప్రజాశక్తి-విజయవాడ

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్మృతివనంలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు గత 9 నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు హెచ్చరించారు. అంబేద్కర్ విగ్రహం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు చేపట్టిన ఆందోళన ఆదివారం మూడవ రోజుకు చేరింది. కార్మికుల ఆందోళనకు సిపిఎం తరుపున సత్యబాబు మద్దతు తెలిపి మాట్లాడారు. ఈ నెల 8న జరిగే విజయవాడ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అంబేద్కర్ స్మృతి వనంలో పని చేస్తున్న 38 మంది కార్మికుల పెండింగ్ వేతనాలు, ఇతర సమస్యలపై తాను కౌన్సిల్‌లో ప్రస్తావించి, వారి సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు అండగా ఉంటానని తెలిపారు. కలెక్టరేట్, విజయవాడ నగరపాలక సంస్థలో జరిగే పిజిఆర్‌ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను కలెక్టర్, విఎంసి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్మికులకు వేతనాలు ఇవ్వలేనని బాధ్యతారాహిత్యంగా కాంట్రాక్టర్ మాట్లాడుతున్నాడని, దీనిపై కలెక్టర్, నగర కమిషనర్, రాష్ట్ర సాంస్కృతిక శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. నెలల తరబడి వేతనాలు రాకుంటే కార్మికులు ఎలా జీవించాలని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కె.దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల బకాయి వేతనాలు ఇవ్వకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మొద్దు నిద్రవీడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. సిఐటియు సెంట్రల్ సిటీ నాయకులు యం.బాబురావు మాట్లాడుతూ కార్మికుల పట్ల ప్రభుత్వానికి, అధికారులకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే జీతాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎం.సోమేశ్వరరావు, కాంట్రాక్ట్ కార్మికులు పి.సునీత, సి.హెచ్.విజయ్ కుమారి, ఎం.సుజాత, కె.అనుష, ఎం.దీపిక, హరిత, కె.ధనలక్ష్మి, పి.సత్యవతి, ఎస్.కె జహిందా, మణెమ్మ, దయామని, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ స్మృతివనం వద్ద ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు


ఇబ్రహీంపట్నంలో బారులుతీరిన వాహనాలు


నందిగామలో నిలిచిపోయిన వాహనాలు

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ : విజయవాడ నగరపాలక సంస్థ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంతోపాటు జోనల్ కార్యాలయంలో సోమవారం "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" నిర్వహిస్తున్నట్లు విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ దగ్గరలోని కార్యాలయంలో సంప్రదించవచ్చుని.. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఫిర్యాదులను స్వీకరిస్తారని, అధికారులందరూ జోనల్ కార్యాలయలతో పాటు ప్రధాన కార్యాలయంలో కూడా అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఈ సదవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యథావిధిగా పిజిఆర్‌ఎస్

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమాన్ని సోమవారం యథావిధిగా నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో తెలియజేశారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తామని తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మునిసిపల్, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. అదేవిధంగా అర్జీదారులు తమ అర్జీలను వెబ్సైట్ నందు నమోదు చేసుకోవచ్చని .. నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100 కి నేరుగా కాల్ చేయవచ్చన్నారు.

ముగిసిన దసరా సెలవులు

- విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : దసరా సెలవులకు సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు సెలవులు ముగియడంతో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. దీంతో విజయవాడ -హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాలు బారులుతీరాయి. దారి పొడవునా రద్దీ కొనసాగడంతో ఆగుతూ.. నెమ్మదిగా కదిలాయి. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. దసరా ఉత్సవాలు ఆదివారంతో పూర్తి స్థాయిలో ముగిసిపోవడంతో విజయవాడ నుంచి హైదరాబాదు వైపునకు వేగంగా దూసుకెళ్తున్న కార్లతో ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్‌లో ట్రాఫిక్ విపరీతంగా పెరిగింది. దీనికి తోడు రింగ్ సెంటర్ వద్ద ట్రాఫిక్‌లో చిన్న చిన్న ప్రమాదాలు జరగడంతో ట్రాఫిక్ ఎక్కడకక్కడే నిలిచిపోయింది. హైదరాబాద్ వెళ్లే తెలంగాణ ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై స్థానిక ఆటో డ్రైవర్ మద్యం మత్తులో దాడి చేసి అద్దం పగల గొట్టడంతో మరికొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మణ్‌రావు ట్రాఫిక్‌ని క్లియర్ చేశారు.

ప్రజాశక్తి- నందిగామ :నందిగామ మండలం అంబారుపేట గ్రామం వద్ద ఆదివారం రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దసరా సెలవులు ముగియడంతో విజయవాడ నుండి హైదరాబాద్‌కు పయనమయ్యారు. దీంతో నందిగామలో ట్రాఫిక్ రద్దీ నెలకొంది. ఫ్లైఓవర్ నిర్మాణం జాప్యం, గతుకుల సర్వీస్ రోడ్డుతో వాహనదారుల ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

సాల్వ్ ఫర్ టుమారో 2025 గ్రాండ్ ఫినాలే జట్లు వెల్లడి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

అతిపెద్ద వినియోగదారు ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శామ్‌సంగ్, సాల్వ్ ఫర్ టుమారో 2025 నాలుగో ఎడిషన్‌లో టాప్ 20 ఫైనలిస్ట్ జట్లను ప్రకటించిందని సంస్థ ఇంచార్జి కె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫైనలిస్టుల్లో గ్రామీణ భారతదేశం, 12 రాష్ట్రాల్లోని ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల నుండి తెలివైన యువతీ యువకులు ఉన్నారని తెలిపారు. ఇది యువతకు తమ కమ్యూనిటీలలో విస్తృత స్థాయి సమస్యలను పరిష్కరించడానికి సాంకేతికతను ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే ఈ కార్యక్రమం దార్శనికతను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 14 ఏళ్ల వ్యక్తి ఫైనలిస్ట్‌గా అర్హత సాధించగా, అంతా బాలికలే ఉన్న బృందం చివరి రౌండ్‌లోకి ప్రవేశించిందన్నారు. ఈశాన్య ప్రాంతం నుండి రెండు జట్లు టాప్ 20లో చోటు దక్కించుకున్నాయని తెలిపారు. గ్రాండ్ ఫినాలేలో నాలుగు విజేత జట్లు ఐఐటి డిల్లీలో ఇంక్యుబేషన్ కోసం శామ్‌సంగ్ నుండి సమిష్టిగా రూ.1 కోటి గ్రాంట్‌ను అందుకుంటాయని తెలిపారు.